www.prajasakti.com
# ప్రజాశక్తి
బుధవారం 18 సెప్టెంబర్ 2024
5
వైఎస్ఆర్



## భూములకు సరిహద్దులు చూపాలి
**ప్రజాశక్తి-కలసపాడు**
వనిపెంటలో నిరుపేదలకు ఇచ్చిన భూములకు సరిహద్దులు చూపాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు డి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పుల్లారెడ్డిపల్లె, సింగరాయపల్లె, కలసపాడులోని పేదలకు 2005 జనవరి 28న ప్రభుత్వం భూములు ఇచ్చింది, వెంటనే సరిహద్దులు చూపాలని ఆయన మంగళవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట భూములను పేదలకు పంపిణీ చెప్పారు. ఇప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరి భూములు ఎక్కడ ఉన్నాయో తెలియక లబ్ధిదారులు ఆయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. తహశీల్దార్ వెంటనే చొరవ తీసుకుని భూములను సబ్ డివిజన్ చేయించి, స్థలాలు చూపాలని కోరారు. లేకపోతే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వై. గోపాలయ్య, వెంకట నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 'తల్లికి వందన'మేది!

- డేటా పేరుతో దోబూచులాటలు
- నాలుగు నెలలుగా సుదీర్ఘ నిరీక్షణ
- 3,26,752 మంది విద్యార్థుల తల్లుల ఎదురుచూపులు



**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**
ఉమ్మడి కడప జిల్లాలో 2,823 పాఠశాలలు ఉన్నాయి. 3,26,752 మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. స్క్రూటినీ చేస్తే సుమారు 1.80 లక్షల మంది విద్యార్థులు అర్హులుగా తేలా అవకాశం కనిపిస్తోంది. 2022-23 సంవత్సరంలో అప్పటి వైసిపి సర్కారు అమ్మఒడి పథకం కింద 1.80 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.270.30 కోట్లు జమ చేసింది. 2021-22 సంవత్సరంలో 1.79 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.244.06 కోట్లు జమ చేసింది. వైసిపి సర్కారు జమ చేసిన అమ్మఒడి నిధులను ప్రయివేటు, కార్పొరేట్ అధిక ఫీజుల చెల్లింపుల సమయంలో తల్లిదండ్రులకు పెద్దఎత్తున ఉపశమనం లభించేది. రాష్ట్రంలోని ఎన్‌డిఎ సర్కారు సామాన్యుల ఆశలతో ఆడుకోవడం విడ్డూరంగా ఉందనే వాదన వినిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ తల్లికి వందనం పథకం అమలు ప్రసక్తినే విస్మరించింది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన డిఇఒలు, ఎస్‌ఎస్‌ఎ పిఒలు, సచివాలయాల దగ్గర పూర్తి స్థాయిలో డేటా అందుబాటులో ఉన్నప్పటికీ డేటా ఎందుకు అందుబాటులో లేదని ప్రతిపక్షాలు, తల్లిదండ్రుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. రాష్ట్రంలో ఎన్‌డిఎ సర్కారు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలో సుమారు రూ.19 వేల కోట్లు అప్పు చేసి ఎవరికి ఏమీ ఒరగబెడుతున్నారనే విమర్శల వెల్లువ కొనసాగుతోంది. తల్లికి వందనం పథకం అమలుపై డిఇఒ దగ్గర ప్రస్తావించగా గైడ్‌లెన్స్ రాలేదని పేర్కొనడం గమనార్హం.

తల్లికి వందనం పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది. శాసన మండలిలో విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ డేటా లేదనే పేరుతో దోబూచులాట ఆడడం ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఎన్‌డిఎ సర్కారు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతోంది. వైసిపి హయాంలోని అమ్మఒడి పథకం పేరు మార్పు మినహా ఎటువంటి పురోగతి సాధించలేదు. హామీలతో అధికారంలోకి వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

### సత్వరమే అమలు చేయాలి



తక్షణమే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ అధిక ఫీజుల దాహానికి తల్లికి వందనం పథకం ఉపశమనం కలిగిస్తుంది. పాఠశాలలు తెరిచి నాలుగు నెలలవుతోందని, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల బాదుడు మొదలు కావడం ఆందోళన కలిగిస్తోంది.

**- ఐశ్వర్య, విద్యార్థి తల్లి, చాపాడు, కడప జిల్లా.**

### తల్లికి వందనంపై ఆశలు



రాష్ట్రంలో ఎన్‌డిఎ సర్కారు అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతోంది. ప్రయివేటు పాఠశాలల అధిక ఫీజుల దోపిడీతో భారంగా మారింది. ప్రభుత్వం సత్వరమే తల్లికి వందనం అమలు చేసి ఆదుకోవాలి.

**- బి.రెడ్డమ్మ, విద్యార్థి తల్లి, రాజంపేట. అన్నమయ్య జిల్లా.**

# ప్రభుత్వ వైద్య విద్యను దూరం చేయొద్దు

## - ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి

**ప్రజాశక్తి - కడప అర్బన్**
పులివెందులలోని వైద్య విద్య కళాశాలను విద్యార్థులకు దూరం చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుర్మార్గమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొన్నారు. తన భాధ్యతను మరిచి ప్రయివేట్‌కు వైద్యవిద్య పట్టం కట్టడం దుర్మార్గమని అన్నారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావల్సిన ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో కడప జిల్లా పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్‌ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల కోల్పోయామని తెలిపారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచన అన్నారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని తెలిపారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని, తద్వారా వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్‌ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారు కానీ ఇచ్చిన హామీపైన ఎందుకు నోరు మెదపడం లేదని వాపోయారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వాచ్చాక వాటి ఊసెత్తకపోవడం కూటమి ప్రభుత్వపు వైఖరిగా ఉందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్‌ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రుద్ద చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర నాయకులు సాయి, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**
పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి పిఎంఎవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధివిధానాలను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ ఎన్‌ఐసి హాలు నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని గ్రామీణ, మునిసిపల్, అర్బన్ డెవలప్మెంట్ ప్రాంతాలలో 2023- 24 కు సంబంధించి నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఒక కోటి కొత్త ఇళ్లతో పాటు ఆవాస్ ఆవాస్ ప్లస్ 2024 యాప్ ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రధాని ప్రత్యక్ష ప్రసారం ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధివిధానాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించుకోవాలన్నారు. ఇళ్లులేని ప్రతి నిరుపేదకు ఒక ఆవాసం ఏర్పాటు చేయడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశవన్నారు. జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరైన వారందరూ త్వరగా ఇళ్లను పూర్తి చేసుకునేలా గృహ నిర్మాణ శాఖ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాలన్నింటిని కల్పించాలన్నారు. అనంతరం గృహ లబ్ధిదారులకు మెగా తాళం చెవిని అందజేశారు. కార్యక్రమంలో కుడా విసి నందన్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, జోయల్ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇఇలు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు మెగా తాళం చెవి అందజేస్తున్న కలెక్టర్


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మాధవి

## పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి
**ప్రజాశక్తి- కడప అర్బన్**
హరితాంధ్ర కడపగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కడప ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం కడప శివారు ప్రాంతంలోని నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. మన ఇంటి పరిసరాలు, వీధులు, మన నగరం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భవిష్యత్ తరాల వారికి ఒక ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించాలని అన్నారు. అధికారులు, ప్రజలు ఈ హరిత యజ్ఞంలో పాలుపంచుకునేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి మన నగరాన్ని పచ్చదనంతో నింపాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి తన తల్లి పేరు వి.లక్ష్మీనారాయణమ్మ పేరుపై మొక్కను నాటారు. పోలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి వారి తల్లి పేరు మీద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యక్రమంలో స్క్వాడ్ డిఎఫ్ఒ గురు ప్రభాకర్, సబ్ డిఎఫ్ఒ స్వామి వివేకానంద, కడప మున్సిపల్ కమిషనర్ వై.వి.నందన్, అడిషనల్ కమిషనర్ రాకేష్, అటవీ శాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి..** ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్వచ్ఛ హీ సేవ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఆర్ఎం కార్యాలయం ఎదుట ఆర్‌టిసి ఉద్యోగుల చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి రెండు గంటలు పరిశుభ్రతకు ఒక కేటాయించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, ఇతరులు వెయ్యకుండా చూడాలని తెలిపారు. ఆరు డిపోలలో స్వచ్ఛత సేవ కార్యక్రమాలు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పశువైద్యాధికారికి సన్మానం
**ప్రజాశక్తి -కడప సిటీ**
కడప బహుళార్ధ పశువైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్న నంద్యాల రాజశేఖర్‌యాదవ్ పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు కొప్పుల శివ యాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కొప్పుల శివ యాదవ్ మాట్లాడుతూ నంద్యాల రాజశేఖర్ ఉద్యోగులు బాగోగులుతో పాటు సమాజంలో ఉన్న పీడిత వర్గాలు బహుజనులు కర్షక శ్రామిక వర్గాలు బలోపేతం కోసం కృషి చేశారన్నారు. నంద్యాల రాజశేఖర్ మాట్లాడుతూ వృత్తిపరంగా తాను పశుసంవర్ధక శాఖలో మూగజీవాల సేవ చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణ, యాదవ్ కడప నగర అధ్యక్షులు ఆవుల రవికుమార్, యాదవ్ నగర ప్రధాన కార్యదర్శి శంకవరపు నరసయ్య యాదవ్, ఉపాధ్యక్షులు పెంచల యాదవ్ పాల్గొన్నారు


రాజశేఖర్ యాదవ్‌ను సన్మానిస్తున్న కొప్పుల శివయాదవ్


## బాల నేరస్తులకు సాయం : జడ్జి
**ప్రజాశక్తి - కడప :** జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి తగు న్యాయ సాయం అందించడమే రెండవ పాన్ ఇండియా ప్రచారం ముఖ్య ఉద్దేశమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం రాజంపేట జైలు బద్వేలు సబ్ జైలును జడ్జి బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. రెండవ పాన్ ఇండియా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ పాన్ ఇండియా ప్రచార కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను బ్యానర్ల రూపంలో ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్‌లో, రైల్వే స్టేషన్‌లో, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసు , లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు, బార్ అసోసియేషన్ హాల్‌లలో ప్రదర్శిస్తామని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని, మండల న్యాయ సేవ సమితులను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో రాజంపేట, బద్వేల్ సబ్ జైళ్ల సూపరింటెండెంట్, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు
**ప్రజాశక్తి-అట్లూరు :** బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులకు మంగళవారం వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మంది వ్యాయామ ఉపాధ్యాయు లకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మం డల విద్యాశాఖ అధికారి ఖాదర్‌వల్లి, ఎంపిడిఒ సుజాతమ్మ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం స్పోర్ట్స్ కాంప్లెక్స్ కన్వీనర్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానం, యోగా అంతర్గత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

## నేటి నుంచి లా పరీక్షలు
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 18 నుంచి 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బి 2, 4, 6 సెమిస్టర్లు, ఐదేళ్ల ఎల్ఎల్‌బి 2, 4, 6, 8,10 సెమిస్టర్లు చదివే విద్యార్థులు నిర్ణీత తేదీలలో సూచించిన సమయానికి పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పరీక్షలు అక్టోబర్ 10 వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. చదువుతున్న కళాశాల నుంచి హాల్ టికెట్, గుర్తింపు కార్డుతో పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడం నిషేధమని పేర్కొన్నారు.

## 23న విద్యార్థులకు పోటీలు
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కడప మండల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈనెల 23న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఒ గంగిరెడ్డి, పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్, పెయింటింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలుంటాయని పేర్కొన్నారు. మండలం పరిధిలోని అన్ని యాజమాన్యాలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న 8,9, 10 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర పరిధిలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా విద్యార్థులను ప్రతి విభాగంలో ఒకరు పాల్గొనేలా చూడాలని పేర్కొన్నారు.

## 'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్
**ప్రజాశక్తి - చింతకొమ్మ దిన్నె**
స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న పి. ఆంజనేయులుకు తమిళనాడు రాష్ట్రంలో ఏలూరులోని వేలూరు విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వేలూరు విఐటి విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జికె రజిని గారి పర్యవేక్షణలో 'ఎస్ హంగింగ్ డేటా ప్రాసెస్ ఇన్ లైట్ ఫీల్డ్ హై పవర్ సెక్టాల్ ఇమేజెస్ త్రు కంబైన్స్ స్పేర్స్' అనే అంశాల పైన చేసిన పరిశోధనలకు గాను ఆంజనేయులుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్ప గంగిరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ విభాగ అధిపతి డాక్టర్ పివి ఎస్. మురళి అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు




డాక్టరేట్ అందుకుంటున్న ఆంజనేయులు

## సాంకేతికతకు మూల పురుషుడు 'విశ్వకర్మ'
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కులవృత్తి గొప్పదనాన్ని, వైభవాన్ని, ప్రభావాన్ని, జీవ నాధారాన్ని పెంపొందించడం, సాంకేతికతకు మూలపురుషుడు విరాట్ విశ్వకర్మ జయంతి ప్రధాన ఉద్దేశ్యం అని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా బిసి వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా, ప్రవచనకారులు దేవశిల్పి విశ్వకర్మను ప్రస్తావించడం సమంజసమైనదన్నారు. కమ్మరి, వడ్రంగి, కాంస్య కమ్మరులు, శిల్పులు, స్వర్ణకారులు మొదలైన కులవృత్తుల వారందనినీ విశ్వకర్మ వారసులన్నారు. వారి కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం ద్వారా రూ. లక్ష రుణాన్ని అందజేస్తుందని తెలిపారు. అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా వీరాట్ విశ్వకర్మ, గాయత్రి చిత్రపటానికి కలెక్టర్ అతిథులతో కలిసి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బిసి కార్పోరేషన్ ఇడి జయసింహ, బిసి వెల్ఫేర్ అధికారి భారత్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, బి.మఠం ప్రధానాచార్యులు గోవిందస్వామి, విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు రమణాచారి, నారాయణమ్మ, బిసి సంక్షేమ శాఖ అధికారులు, పిఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులు పాల్గొన్నారు.


చిన్నారికి మాత్రలు మింగిస్తున్న ఐసిడిఎస్ పీడీ

## నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ
**ప్రజాశక్తి - కడప అర్బన్**
అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయాలని ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం సాయిపేట అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల మందులు వేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ భోజనం తిన్న అరగంట తర్వాత మాత్ర ను వేయాలన్నారు. మాత్రను బాగా నమిలి మింగేలా ఆరోగ్య కార్యకర్తలు చూసుకోవాలని చెప్పారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలకు మరొకటి రోజైనా మాత్ర వేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ సునంద, మెడికల్ ఆఫీసర్ శ్రావణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ పుల్లయ్య, ఎడబ్ల్యు రమాదేవి, సరస్వతి, ఎఎన్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా మునిసిపల్ హై స్కూల్(మైన్)లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప ఎమ్మెల్యే మాధవి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. నాగరాజు, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిఇఒ అనురాధ, మున్సిపల్ కార్పొరేషన్ అదరపు కమిషనర్ రాకేశ్, డిఐఒ డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సేవాతత్పరుడు 'గానుగపెంట'
**ప్రజాశక్తి -కడప సిటీ :** ఉత్తమ సేవా తత్పరుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అని వైఎస్ఆర్ కడప జిల్లా బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పేర్కొన్నారు. హనుమంతరావు 78వ పుట్టినరోజును పురస్కరించుకొని కడప మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ హనుమంతరావు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి, నిరంతర సాహిత్య, సామాజిక సేవ చేశారన్నారు. కార్య క్రమంలో బిసి సంఘ నాయకులు కళ్యా సుధాకర్, సుబ్బారావు, త్రివిక్రమ్, అంజి , పల్లా నరసింహారావు, మూలాన ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రాయల్ షబ్బీర్ పాల్గొన్నారు.


'గానుగపెంట'ను సన్మానిస్తున్న నాయకులు

## ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి : ఎస్‌పి
**ప్రజాశక్తి - కడప అర్బన్**
'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. మిలాడినబి సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమాకాంత్ పాల్గొన్నారు.

## కంపోస్టు తయారీపై శిక్షణ
**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె**
ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వానపాముల ఎరువు తయారీపై రైతులకు మంగళవారం రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన తర్వాత ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని తెలియజేశారు. విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులను వాడడం వల్ల భూసమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు భూసారాన్ని పరీక్షించడం కోసం తక్కువ ఖర్చుతో అన్ని పోషకాలను మొక్కకు అందించే సేంద్రీయ ఎరువులలో ముఖ్యమైన ఎరువు వర్మీ కంపోస్ట్ అని తెలియజేశారు. సేద్యపు విభాగం శాస్త్రవేత్త మహేశ్వరి మాట్లాడుతూ వర్షాధార పరిస్థితులు ఎక్కువగా ఉండటం వల్ల కేవలం వ్యవసాయ పంటల ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించడమే కష్టతరం అవుతున్న నేపథ్యంలో యువరైతులు కొద్దిపాటి వనరులను లాభసాటిగా మార్చుకో వాలన్నారు. వర్మీపుకంపోస్టు తయారీకి అనుకూలమైన పరిస్థితులు, కావాల్సిన పరికరాలు, వాడదగిన వ్యర్థపదార్థాలు, వానపాముల రకాలు, కంపోస్ట్ బెడ్ల నిర్మాణం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ వి శిల్పకళ, డాక్టర్ టి. మహేష్ బాబు, డాక్టర్ మానస, సురేష్, శాస్త్రవేత్త, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ముందుండాలి : ఎస్ఇ
**ప్రజాశక్తి - కడప**
ప్రజలకు ఉప యోగపడే సేవలు అందించడంలో ఇంకా ముందుకు వెళ్లాలి అని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. సామాజిక సేవలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా చేస్తున్న సేవలను అభినందించారు. కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవాసంఘం( కెవియు ఎస్ఎస్ఎస్) తరుపున మంగళవారం సాయంత్రం కడప విద్యుత్ భవన్ నుంచి విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా రూ. 5. 35 లక్షలు వ్యయం చేసే 750 ఇంటి సరుకుల ప్యాకెట్లతో కూడిన లారీని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే సేవల వల్ల పేదలకు ఏదోరకంగా ఆసరాగా ఉండడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్, సామాజిక సేవ సంఘ అధ్యక్షులు డి నాగరాజు, సేవా సంఘం జనరల్ సెక్రెటరీ ఎం.వి. చలపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ హరిసేమనాయక్, అధికారులు, విద్యుత్ సిబ్బంది, అన్ని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



సరుకుల లారీని ప్రారంభిస్తున్న విద్యుత్ ఎస్ఇ

## గాయపడిన కార్మికుడు మృతి
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఇటీవల నగరంలోని ఎన్‌టిపిసి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు సుధాకర్ మృతి చెందారు. మంగళవారం రామాంజనేయపురం దగ్గర ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. నగర మేయర్ కె.సురేష్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, 9వ డివిజన్ కార్పొరేటర్ కిరణ్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు కంచుపాటి తిరుపాల్, సుంకర రవి, నగరపాలక సంస్థ సిబ్బంది మృత దేహానికి నివాళులర్పించారు.

## నేత్రదానంతో అంధత్వంలేని సమాజం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

నేత్రదానం చేస్తే అంధత్వం లేని సమాజాన్ని నిర్మించవచ్చునని స్నేహిత అమృత హస్త సేవా సమితి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రబ్బా చిన్న వీరన్న మరణించడంతో ఆయన భార్య వెంకట సుబ్బమ్మ, కుమారుడు విష్ణువర్ధన్, కుమార్తెలు వీణా, విజయశ్రీ, కోడలు మౌనిక, అల్లుళ్ళు రాజగోపాల్, సంతోష్, అన్న హౌసింగ్ విశ్రాంత ఇఇ వీరన్న, తమ్ముడు రమేష్ నేత్ర దానానికి అంగీకరిస్తూ.. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. ఆ మేరకు మంగళవారం టెక్నీషియన్ హరికృష్ణ కలిసి చెన్నారెడ్డి కాలనీలో మృతుని ఇంటికి వెళ్లి పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు రాజు తెలిపారు. నేత్రదానం చేయదలచుకున్న వారు 99665 09364 లేదా 70932 04537కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - మైదుకూరు**

ఫిర్యాదుదారుల సేవలే లక్ష్యంగా పనిచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ పేర్కొన్నారు. మంగళవారం మైదుకూరు విద్యుత్ కార్యాలయంలో మైదుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, మైదుకూరు రూరల్ ప్రాంత మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వంద శాతం విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు కేటాయించిన ప్రాంతాల్లో నివాసం ఉంటే ఆశించిన మేర ఫలితాలు వస్తాయని తెలిపారు. అధికారులు, సిబ్బంది సంబంధిత ప్రాంతాల్లో విధిగా అందుబాటులో ఉండాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, కేటాయించిన ప్రాంతాల్లో సిబ్బంది నివాసంలేని వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. బకాయిల వసూలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఇఇ భరణి కృష్ణ, డిఇఇ శ్రీనివాసులరెడ్డి, ఎఇలు, జెఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో పని చేస్తున్న ఆర్మీ జవాన్ సుబ్బారావు(38) మృతి చెందడంతో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వేంపల్లెలోని శ్రీరామ నగర్‌లో ఉంటున్న చల్లా సూర్యనారాయణ, కమలమ్మ కుమారుడు చల్లా సుబ్బారావు 18ఏళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. అనారోగ్యంతో ఈ నెల 15న సుబ్బారావు మృతి చెందాడు. డ్యూటీలో మృతి చెందడంతో సుబ్బారావు మృతదేహాన్ని అరుణాచల్ ప్రదేశ్ నుంచి మంగళవారం వేంపల్లెకు తీసుకొచ్చారు. అనంతరం ఆర్మీ లాంఛనాలతో పాపాఘ్ని నదిలో సుబ్బారావు అంత్యక్రియలు నిర్వహించారు. సుబ్బారావుకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు హేమ, జగదీష్ ఉన్నారు.

## వెబ్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - మైదుకూరు**

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా వెబ్ డెవలపర్ కోర్సు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కూడా చూపుతామన్నారు. మైదుకూరు మండలంతోపాటు చుట్టుపక్కల ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వెబ్ డెవలపర్ కోర్సుకు బీకాం, బీఎస్సీ, బీటెక్, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలు రిజిస్ట్రేషన్ కోసం 93983 48760, 97018 01902 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## నులిపురుగుల నివారణకు చర్యలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక క్రిష్టియన్ కాలనీ, దళితవాడ, కాపు వీధి, గాండ్లవీధి, అమ్మవారిశాల ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సిడిపిఒ సునీత అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, వేంపల్లి సచివాలయం రాణి, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ అరుణదేవి, అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి, లక్ష్మిదేవి, జీవ కళావతి, భాగమ్మ, ఆశ కార్యకర్తలు మాలిని, శివకుమారి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయనున్నట్లు జమ్మలమడుగు నగర పంచాయతీ కమి షనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ఈ మాత్రలను సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రెండుసార్లు వేసుకోవాలన్నారు. స్కూల్స్, కాలేజీలలో వీటిని పిల్లలకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షమనాజ్, హెడ్మాస్టర్ వేదవతి, మెడికల్ సిబ్బంది, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు:** నులి పురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభాకుమారి, ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసులు, సాంబశివారెడ్డి, రామమోహన్ రావ్, సంజీవప్ప, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆవాస్ గ్రామీణ, పట్టణ గృహాలు ప్రారంభం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**


గృహాలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ఆవాస్ గ్రామీణ, పట్టణ గృహ ప్రవేశాలను మంగళవారం పట్టణంలోని నగిరిగుట్టలో హౌసింగ్ డిఇ రమణారెడ్డి ఆధ్వర్యంలో బిఎల్‌సి పథకం కింద మం జూరైన ఇళ్లను ప్రారం భించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహ బూబ్ బాషా, మైసూరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఎఇలు పమోద్‌కుమార్, పురుషోత్తం నాయక్, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

## అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

**ప్రజాశక్తి- పులివెందుల రూరల్**

పట్టణంలోని వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రెండవ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సులు శైలజ, శిరీష, హారిక మాట్లాడుతూ జీవో 115ను వెంటనే రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరిం చకపోతే నిరసనలను ఉధృతం చేస్తామన్నారు.

# ఓజోన్‌పొర పరిరక్షణతోనే జీవరాశి మనుగడ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**


వినూత్న రీతిలో పురవీధుల్లో గొడుగులతో ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

ఓజోన్ పొర పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి(ఆప్ కాస్ట్), పాఠశాల విద్యా శాఖ కడప జిల్లా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో గొడుగులతో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయులు ఎం.రఘురామయ్య అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా సమన్వయకర్త విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలోని సమతుల్యతను కాపాడాలని సూచించారు. ఓజోన్‌ను నాశనం చేసే పదార్థాలను తక్కువగా విడుదల చేయాలనే అంశాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. మొక్కలు ఎంత ఎక్కువగా పెంచితే అంతగా పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త డివి సుబ్బా నాయుడు మాట్లాడుతూ ఓజోన్ సహజంగా విష వాయువు అయిన అతినీల లోహిత కిరణాలను జీవరాశిపై పడకుండా చేసి కాపాడుతుందన్నారు. ఓజోన్‌ను కాపాడుకుంటే మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. సోషల్ ఉపాధ్యాయులు వెంకటరమణ మాట్లాడుతూ రేపటి పౌరులైన విద్యార్థులు ఓజోన్ పరిరక్షణను ఒక లక్ష్యంగా స్వీకరించాలన్నారు. హిందీ ఉపా ధ్యా యులు నాగభూషణం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు భాగ్యలక్ష్మి, నూరుద్దీన్, శివప్రతాప్, వెంకట్ నాయక్, ఓబయ్య పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత



ర్యాలీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్

**ప్రజాశక్తి - మైదుకూరు**

పట్టణంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుండి రాయల్ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, మైదుకూరు ప్రధాన రోడ్డులలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం రాయల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వ కిరీటి, ఎంపీడీవో లక్ష్మిదేవి, తహశీల్దార్ రాజసింహ, పట్టణ సిఐ హసం, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వేంపల్లె :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతంగా ప్రతి ఒక్కరూ ఉండాలని ఎంపిడిఒ సంపతి దివిజా తెలిపారు. మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుండి పుర వీధుల గుండా గ్రామ సచివాలయం, పారిశుధ్యం కార్మికులతో కలిసి ఎంపిడిఒ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ బజార్‌లో పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి మల్లికార్జునరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

**చాపాడు :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. చాపాడులో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రభుత్వ అధికారులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతను గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ మహబూబ్ బీ, ప్రధానోపాధ్యాయులు మైనుద్దీన్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబు, గ్రామ టిడిపి నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఖాజీపేట :** పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వచ్ఛతా హీ సేవా భాగంగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ యేసుపాదం, రాజారెడ్డి, అంకాల్ యాదవ్, సామెల్, నరసింహ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**ముద్దనూరు :** వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. బహిరంగ మల విసర్జన అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగు దొడ్లు వినియోగించాలన్నారు. ఇఒపిఆర్‌డి వీర భద్రుడు, వెలుగు ఎపిఎం ఇబ్రహీం, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధి, వెలుగు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**సింహాద్రిపురం :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కృష్ణమూర్తి, డిఎల్‌పిఒ రమాదేవి సూచించారు. మంగళవారం సింహాద్రిపురం గ్రామ పంచాయితీలో స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి బుడ్డయపాలెం సర్కిల్లో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురప్ప, మాజీ హాస్పిటల్ చైర్మన్ పుప్పాల శ్రీధర్‌రెడ్డి, పంచాయితీ ఇఒ హరికిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు :** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే నులిపురుగులను దూరం చేయవచ్చని నేషనల్ హెల్త్‌మిషన్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర శశిభూషణ్‌రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిఒ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మృతికి సిపిఎం నివాళి

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి మంగళవారం మండల కేంద్రంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి నాయకుడికి చేరుకున్నారని పేర్కొన్నారు. పి.సుందరయ్య, ఇఎంఎస్, బిటిఆర్, హరికిషన్ సింగ్ సూర్జిత్, బసవ పున్నయ్య, జ్యోతిబసు వంటి సీనియర్ నాయకులతో కలిసి పనిచేశారన్నారు. సిపిఎం, వామపక్ష పార్టీలకు, భారత రాజకీయాలకు సీతారాం మార్గదర్శకంగా వ్యవహరించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం బి.మఠం మండల కార్యదర్శి గోవింద్, మండల కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్, రవణమ్మ, అజయ్, సిపిఎం మైదుకూరు మండల కమిటీ సభ్యులు గురవయ్య, నాయకులు రాహుల్, పోలయ్య, బాలయ్య, రమేష్, వాసు పాల్గొన్నారు.

## మెడికల్ సీట్లను నిరాకరించడం సరికాదు : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లను నిరాకరించడం సరికాదని, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ సూచించారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలలో సెల్ ఫైనాన్స్ సీట్లను రద్దు చేస్తామని తెలుగుదేశం కూటమి పేర్కొందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపు రద్దు చేస్తామని హామీ ఇచ్చారనీ, ఇప్పటివరకు రద్దు చేయలేదన్నారు. పులివెందుల కాలేజీకి వచ్చిన 50 సీట్లను కూడా వద్దంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, శ్రవణ్, నాయకులు సప్తగిరి, ప్రసాద్, యోగేష్, పాల్గొన్నారు.

## కార్యకర్తలు అధైర్య పడొద్దు : ఎంపీ

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**


ఆర్‌డిఒ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు వైసిపి అండగా ఉంటుందని, ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయానికి ఎంపీ వచ్చారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను, అధికార పార్టీ నాయకులు పెడుతున్న ఇబ్బందులను ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సహనంతో ఉండడం వల్ల ప్రతి సమస్యను ఎదుర్కోవచ్చన్నారు. దేనికైనా సమయం వస్తుందని అంతవరకు వేచి ఉండాలన్నారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మేపల్లి గ్రామానికి చెందిన వారికి ఒంటిమిద్దెలో ఇచ్చిన ఇళ్ల పట్టాల స్థలంలో కట్టుకున్న బేస్ మట్టాలను ఇటీవల కాలంలో అధికార పార్టీ నాయకులు తొలగించారనే సమస్యను ఆర్డీఒ శ్రీనివాసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఒ స్పందించి ఇచ్చిన 43 పట్టాలకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, పట్టాలు ఇవ్వని వారికి కొత్త ప్రభుత్వం తెచ్చే పాలసీ ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, హృషికేశవ రెడ్డి, గజ్జల లక్షుమయ్య, పొచిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యోబు, వద్దిరాల లక్షుమయ్యా, గౌస్ లాజమ్, బొమ్మేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నడిపి ఓబయ్య మృతి తీరని లోటు

**- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి**

**ప్రజాశక్తి - దువ్వూరు**

మాజీ ఎంపీపీ జెర్రీ నడిపి ఓబయ్య యాదవ్ మృతి తీరనిలోటని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొనాన్రు.ఆయన ఇటీవల మృతి చెందారు. మంగళవారం ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి ఓబయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు ర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రహ్మసాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నుండి ఎడమ కాలువకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మంగళవారం నీటిని విడుదల చేశారు. ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ సొంత మండలం కావడంతో టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, ముడమల పోల్‌రెడ్డి, ఎస్సార్ శ్రీనివాసరెడ్డి ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యే బ్రహ్మంగారిని దర్శించుకుని నీటిని విడుదల చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మం సాగర్‌కు 14 టీఎంసీ నీటిని నిలువ ఉంచేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలమల నారాయణ, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జయరామిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు సన్నపురి శ్రీనివాసులు, అధికారులు సిఇ మల్లికార్జునరెడ్డి, ఎస్‌సి వెంకటరామయ్య, ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇ కృష్ణారెడ్డి, ఎఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**దువ్వూరు :** మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కెజిబివిలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మొక్కలు నాటారు. విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి

**ప్రజాశక్తి - చాపాడు**

చాపాడు మండల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను తన కుమారుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అందుకు అనుగుణంగా తన కుమారుడి సహాయంతో కేంద్ర నిధులను మంజూరు చేయిస్తున్నామన్నారు. చాపాడు మండలానికి సిఎస్ఆర్ నిధుల కింద రూ.2.50 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ యువత, రైతులు, ఆరోగ్యం పాఠశాలలు, మహిళల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎంపీడీఒ శ్రీధర్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివ రుద్రగౌడ్, ఏఈ గౌతమి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఏపిఒ జగదీశ్వర్ రెడ్డి, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గురివి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ వేమారెడ్డి, గోసుల కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, మాజీ జెడ్పిటిసి మేకల బాబు, నాయకులు సుదర్శన్, నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

పేదల ఆకలి తీర్చే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లు మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం హర్షణీయమని, వీటిని కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాలలోనే పేదరికం ఎక్కువగా ఉందన్నారు.గ్రామాలపట్ల వివక్ష చూపించడం ధర్మం కాదన్నారు. మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది కొరత సాకులుగా చూపి పులివెందుల మెడికల్ కాలేజీకి 2024-25విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమిషన్ మంజూరు చేసిన 50 ఎంబిబిఎస్ సీట్లు వద్దని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య కమిషన్‌కు లేఖ రాయడం దుర్మార్గమన్నారు. ఆమాటకొస్తే రాష్ట్రంలో సగం ఆస్పత్రులకు మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత ఉందన్నారు. అంతమాత్రాన వీటిని మూసివేస్తామా అని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలోని తుమ్మల పల్లి యురేనియం ప్లాంట్‌లో టెయిల్ పాండ్ వ్యర్థ పదార్థాల లీకేజీ తరచుగా జరగడం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. లీకేజీ కాకుండా శాశ్వత నివారణ చర్యలు యురేనియం అథారిటీ తీసుకోవాలని కోరారు. ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులకు పరస్పర బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీకి 74వ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

**సింహాద్రిపురం :** గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బలపనూరులో పోషణ మహా కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాల ద్వారా కాంప్లిమెంటరీ ఫుడ్ వంటకాలను వండడంపై అవగాహన కల్పించారు. ఎంపి హెచ్ఎస్ రాధా, ఎఎన్ఎం గంగాదేవి, అంగన్‌వాడీ టీచర్స్, ఆశాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి (58) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. సోమిరెడ్డి తన తోట వద్దకు రోజు మాదిరిగానే మంగళవారం వెళ్లాడు. విద్యుత్ స్టార్టర్ అన్ చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. సోమిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**ఉరేసుకుని మరో వ్యక్తి..**

పట్టణంలోని జెండామాను వీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ కాసిం పీరా కుమారుడు సయ్యద్ ఖాదర్ బాషా (43) మంగళవారం ఉరివేసుకొని మృతి చెందాడు. తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. ఖాదర్‌బాషా కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటిలోనే ఉండేవాడు. ఆరోగ్యం బాగా కాకపోవడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కారణాలను అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.